క్లుప్తంగా

పక్కాగా కులగణన



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

సీతానగరం: పక్కాగా కులగణన చేపట్టాలని ఎంపీడీవో ఎం.ఎల్.ఎన్.ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ కె.కుమారవర్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు కులగణన నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి జరిగే ఈ కార్యక్రమంపై తొలుత ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. నిర్దేశిత గడువులోగా కులగణన పూర్తిచేసి, వివరాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

ప్రాథమిక చికిత్సపై శిక్షణ తరగతులు

గుమ్మలక్ష్మీపురం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పార్వతీపురంలోని రాజా హిందీ కళాశాల వద్ద ఈ నెల 22, 23వ తేదీల్లో ప్రాథమిక చికిత్స, ఇంజక్షన్ వేయడం, గుండెపోటు వచ్చిన సమయంలో తీసుకోవాల్సిన ప్రాథమిక చికిత్సపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక నాయకుడు పాలక రంజిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు వచ్చే వారికి భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు ధ్రువపత్రాలు కూడా అందజేస్తామన్నారు. కావున ఆసక్తి ఉన్న యువతీ, యువకులు శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని, ఇతర వివరాలకు 94949 16182 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యాప్‌లో వివరాల నమోదు

పాలకొండ: కులగణన సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో కులగణన పూర్తి చేయాలన్నారు. యాప్‌లో అన్ని వివరాలు నమోదు చేయాలని సూచించారు.

హోరాహోరీగా క్రీడాపోటీలు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

భామిని: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఏపీ మోడల్ స్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ విభాగాలకు సంబంధించి క్వార్టర్ ఫైనల్ పోటీలు జరిగాయి. విజేతలను ఎంపీడీఓ జె. ఉమామహేశ్వరి, క్రీడా కన్వీనర్ శివరామప్రసాద్ అభినందించారు.

అయోధ్య అక్షతల పంపిణీ

భామిని: మండలంలోని బత్తిలిలో వెలిసిన శ్రీరాధా బృందావనస్వామి మఠం అధిపతి మహంత్ శ్రీమదన్ మోహన్‌దాస్‌కు శ్రీరామా సేవా సంఘ సభ్యులు ఆర్‌కే భట్టు, తదితరులు అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను గురువారం అందజేశారు. శ్రీరామమందిర చిత్రపటం అందజేసి, ఈ నెల 22న జరగనున్న బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానించారు.

తీరిన రహదారి సమస్య..



నాడు: గుంతలుగా ఉన్న రహదారి



నేడు: కొత్తగా వేసిన సీసీ రహదారి

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని జగన్నాథస్వామి ఆలయం నుంచి సీతంపేట రహదారిలోని సింగన్నవలస సెంటర్ వరకు సీసీ రోడ్డు వేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు వేయాలని టీడీపీ హయాంలో ప్రజలు కోరినా ఒక్క పైసా విదల్చలేదు. రహదారి మొత్తం గోతులతో నిండిపోవడంతో జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవం సమయంలో లక్షలాదిగా తరలివచ్చే భక్తులు ఇబ్బందులు పడేవారు. ప్రధానంగా పాలకొండ పట్టణానికి రింగ్ రోడ్డులా ఉపయోగ పడే రహదారిని అప్పటి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.40 లక్షలతో సీసీ రోడ్డు వేయడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పాయి.

మద్యంబాటిళ్ల స్వాధీనం

పాలకొండ రూరల్: మండలంలోని యరకారాయపురానికి చెందిన కె. పద్మావతి 12 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పాలకొండ ప్రధాన మార్కెట్ వద్ద గురువారం పట్టుకున్నట్లు ఎస్సై హేమంత్‌కుమార్ తెలిపారు. టీడీ పారాపురం గ్రామానికి చెందిన కె.రాజశేఖరం అనే వ్యక్తి తరలిస్తున్న 13 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రణాళికాయుతంగా అభివృద్ధి పనులు

–జిల్లా రిసోర్స్‌పర్సన్ శశిభూషణరావు



సీతానగరం: సూచనలిస్తున్న డీఆర్పీ శశిభూషణరావు

సీతానగరం: ప్రణాళికల ఆధారం (ప్రణాళికాయుతం)గా అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా రిసోర్స్‌పర్సన్ శశిభూషణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.ఎల్.ఎన్.ప్రసాద్ అధ్యక్షతన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలుపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ బి.రమణమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన(జిల్లా రిసోర్స్ పర్సన్) మాట్లాడుతూ ప్రతీ గ్రామం సమగ్రంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికల రూపకల్పన, ఆ తర్వాత పనులు జరిగేలా చూడాలన్నారు. ప్రజల అత్యవసరాలు తీర్చే అభివృద్ధి పనులు తొలుత చేపట్టాలన్నారు. గ్రామసభల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, ఈవోపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ, డీఆర్పీ మనోహర్, ఎంఈవో జి.సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్థానిక సంస్థలకు మంజూరయ్యే నిధులతో తొలుత ఏం అభివృద్ధి పనులు చేపట్టాలి, వాటికి అవసరమైన ప్రణాళికలు ఎలా రూపొందించుకోవాలన్న దానిపై చర్చ జరగాలన్నారు. గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా అభివృద్ధి పనులు, వాటి ప్రణాళికలపై నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దేవకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, రిసోర్స్‌పర్సన్లు, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: పంచాయతీ నిధుల వినియోగానికి వార్షిక ప్రణాళికలు ఎంతో అవసరమని ఎంపీపీ నాగమణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో 2024–25 పంచాయతీ నిధుల వార్షిక ప్రణాళికల తయారీపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలకు సమకూరే నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి, పక్కాగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రణాళికాయుతంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గతంలో లాగా పనుల మార్పిడి పనికిరాదన్నారు. గ్రామసభల్లో పంచాయతీ అభివృద్ధి పనులపై చర్చ జరగాలని, ప్రణాళికల తయారీపై కూడా చర్చించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఈవోపీఆర్డీ రవికుమార్, ఏపీవో కేశవరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



మక్కువ: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ



బలిజిపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చరిత్రాత్మకం

పార్వతీపురంటౌన్: విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈ నెల 19వ తేదీన చేపట్టబోయే 125 అడుగుల ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ అనేది చరిత్రాత్మకమని ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ వ్యవస్థాపకుడు, ఎంఈవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఓ ప్రకటనలో గురువారం అన్నారు. ఈ సామా జిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ ప్రతిఒక్కరూ గర్వించదగ్గ విషయమన్నారు. అక్కడి స్మృతివనంలో అంబేడ్కర్ జీవిత విశేషాలతో కూడిన ఫొటో గ్యాలరీ భావి తరాలకు స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా పాలన కొనసాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించండి

సీతంపేట: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కల్పనా కుమారి తెలిపారు. సెక్టోరియల్ అధికారులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాలకొండ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ స్టేషన్ల మార్పు చేయాల్సి ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్లకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు పోలింగ్ కేంద్రం వద్ద సమకూర్చాలని సూచించారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గరాదన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



బీసీ కాలనీలో పూర్తయిన సీసీ రోడ్డు



మంచినీటి కోనేరు వద్ద శరవేగంగా జరుగుతున్న సీసీ రోడ్డు పనులు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అంటిపేట గ్రామ సచివాలయం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మండల ఇంజినీరింగ్ అధికారి జి.చంద్రమౌళి గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు కొనసాగించాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా విడుదలైన నిధులతో కూడా చాలాచోట్ల సీసీ రోడ్లు, ప్రభుత్వ భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అంటిపేట బీసీ కాలనీలో రూ.12 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుండగా, ఇప్పటికే అంటిపేట ఎస్సీ కాలనీలో రూ.10 లక్షల విలువైన ఎన్ఆర్ఈజీఎస్(ఉపాధి హామీ పథకం) నిధులతో సీసీ కాలువల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. సర్పంచ్ ఎం.తిరుపతిరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగారావు కృషి ఫలితంగా ప్రభుత్వం అంటిపేట నుంచి వెన్నెల బుచ్చింపేట మీదుగా బొబ్బిలి మండలంలోని కోమటిపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ పనులతో ప్రభుత్వ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

బలిజిపేట: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని శివరాంపురం, సుభద్ర గ్రామపంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై గురువారం అవగాహన కల్పించారు. పంటలపై పురుగు మందు పిచికారీ చేసేందుకు కేంద్రం సబ్సిడీపై డ్రోన్‌లు అందిస్తోందన్నారు. రూ.12 లక్షల విలువైన డ్రోన్ రాయితీపై రూ.4 లక్షలకే వస్తుందని ప్రోగ్రాం అధికారి రవికుమార్ తెలిపారు. ఈ డ్రోన్ ద్వారా ఎకరా పొలానికి 5 నిమిషాలలో పురుగు మందు పిచికారీ చేయొచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వాల్‌పోస్టర్లు, క్యాలెండర్లు ఆవిష్కరించారు.

సీతానగరం: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతోందని ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ రెడ్డి సింహాచలం అన్నారు. గురువారం మండలంలోని పణుకుపేటలో సర్పంచ్ బంకురు పద్మావతి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గ్రామసభ నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పథకాలను కూడా ప్రజలకు తెలిపారు. యాత్రలో భాగంగా గ్రామ గ్రామాన ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజలకు వైద్యసేవలు అందజేయడం జరుగుతోందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె. కుమారవర్మ తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం: కేంద్ర ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా కో-ఆర్డినేటర్ సింహాచలం



బలిజిపేట: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

అభివృద్ధికి ప్రణాళికలు



పాలకొండ రూరల్:అభివృద్ధి పనులపై జాయింట్ కమిషనర్‌కు వివరిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: క్షేత్రస్థాయిలో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. గురువారం పాలకొండ వచ్చిన ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న కార్యదర్శుల, సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ సహాయకుల జీపీడీపీ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాల మేరకు ప్రజలకు పాలన, సంక్షేమ లబ్ధి సమకూరేలా విధులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై ఎంపీడీఓ దొంక త్రినాథులు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, తదితరులు సిబ్బందికి శిక్షణ ద్వారా తెలియజేశారు. అనంతరం పంచాయతీల వారీగా ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీఓ జాయింట్ కమిషనర్‌కు వివరించారు.

ప్రణాళికలు తప్పనిసరి

సీతంపేట: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరని మండల పరిషత్ పరిపాలనాధికారి మాస అన్నారు. గురువారం స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024–25 సంవత్సరానికి గ్రామాల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై సమగ్రప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

– శిక్షణ తరగతులు..

జియ్యమ్మవలస: గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ, 2024 – 25 సంవత్సరానికి గాను ఎటువంటి అభివృద్ధి పనులు చేయడానికి ప్రణాళికలు ఎలా రూపొందించాలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పెదబుడ్డిడి, తురకనాయుడువలస, పరజపాడు, చింతలబెలగాం, పెదమేరంగి, చినమేరంగి, తదితర 13 పంచాయతీలకు సంబంధించిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. ఈనెల 19వ తేదీ నుంచి గ్రామాలలో కులగణన జరుగుతుందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 8 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరి వేలిముద్రలు తీసుకుంటారని తెలిపారు.

జీపీడీపీపై అవగాహన

భామిని: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై కార్యదర్శులకు ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, ఈఓపీఆర్డీ జి. కృష్ణారావు ప్రణాళికల తయారీ, పనుల కేటాయింపుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి.భవానీశంకర్, కె.సంతోష్‌కుమార్, కెశ్రీనివాసరావు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, మహిళా పోలీస్‌లున్నారు.

– పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు అవసరం

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు అవసరమని ఎంపీపీ ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీపై జరుగుతున్న శిక్షణలో వారు మాట్లాడుతూ, ప్రణాళికల తయారీలో అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలపై ముందస్తుగా చర్చించుకుని ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. పైడితల్లి, ఈఓపీఆర్డీ ఎల్. గోపాలరావు, ఉపాధి ఏపీఓ మండల గౌరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీ, ఎంపీడీఓ



గరుగుబిల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

పుచ్చకాయల సాగుతో అధిక లాభాలు

● ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి

పాలకొండ రూరల్: అనేక పోషక విలువలు కలిగి ఉండడంతో పాటు వేసవి నేపథ్యంలో దాహార్తిని తీర్చడంలో పుచ్చకాయలు శ్రేష్ఠమైనవి. ప్రస్తుత సీజన్‌లో ఈ పంటను వేయటం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చని ఉద్యానవన శాఖాధికారి టి.అమరేశ్వరి తెలిపారు. ఈ నేపథ్యంలో సాగులో చేపట్టాల్సిన నీటి యాజమాన్యం చర్యలు, సస్యరక్షణపై పలు సూచనలు చేశారు.

● అంతరకృషి తప్పనిసరి...

పుచ్చకాయల సాగులో కలుపు నివారణలో భాగంగా అంతరకృషి అవసరముంటుంది. కలుపు నివారణకు 200 లీటర్ల నీటిలో పెండిమిథాలియన్ 1.5 లీటర్లు కలిపి పంట వేసిన 48 గంటల్లోగా పిచికారీ చేయాలి. ఆకు దశలో మూడు గ్రాముల బోరాక్స్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఆడపూలు అధికంగా వచ్చి దిగుబడి పెరుగుతుంది. పూత రావడానికి ముందు తీగ చివరిలో తుంచడం వల్ల పక్క తీగలు పెరిగి దిగుబడి పెరిగేందుకు అవకాశాలుంటాయి. కాయ పెరుగుల దశలో వారానికి ఒకసారి కాయలు తిప్పుతూ ఉండడం వల్ల మచ్చలు లేని మంచి కాయలు వస్తాయి.

● ఎరువుల వినియోగం..

ఎకరాకు 4 నుంచి 5 టన్నుల వరకు సేంద్రియ ఎరువుల్లో భాగంగా పశువుల ఎరువును అందించాలి. దీంతోపాటు 40 కిలోల భాస్వరం, పొటాషియం 24.. నత్రజని 40 కిలోలు సమకూరే ఎరువులు వేయాలి. పంట వేసిన 25 రోజుల తర్వాత నత్రజనిని మరోమారు వేసుకోవడం వల్ల ఉత్తమ ఫలితాలు వస్తాయి.

● నీటి యాజమాన్యం...

పంట మొలకెత్తిన తర్వాత 7 నుంచి 10 రోజుల వ్యవధిలో నీరు అందించాల్సి ఉంటుంది. అలాగే కాయలు నేలకు తాకి ఉండడం వల్ల నీరు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కాయ పెరిగే దశలో, మొక్క ఎదిగే దశలో, కాయ పక్వానికి వచ్చే దశలో నీరు కడితే కాయలపై బీటలు ఏర్పడవు.



పుచ్చపంట

తెగుళ్ల నివారణ ఇలా...



పుచ్చపంటలో తెగుళ్లు, పురుగులు, బూజు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా మోటాలాక్సిల్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. బూడిద తెగులు నివారణకు లీటర్ నీటిలో కేరాథేన్ లేదా ట్రైడీమార్ఫ్ మందు కలిపి చల్లుకోవాలి. కాయకుళ్లు తెగులు నివారణకు మోటాలాక్సిల్ లేదా మాంకోజెబ్ మిశ్రమం 2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయసుకోవాలి. అలాగే తామర పురుగు నివారణకు లీటర్ నీటిలో రెండు ఎం.ఎల్ ఫిప్రోనిల్ మందు కలిపి పిచికారీ చేస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయి.

– టి. అమరేశ్వరి, ఉద్యానవన శాఖాధికారి

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

● ఎంపీపీ అధ్యక్షుడు రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు

గరుగుబిల్లి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల పరిషత్ అధ్యక్షుడు ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను వారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలు క్రీడాచరిత్రలో అతిపెద్ద మైలు రాయి అని కొనియాడారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల దైనందిన జీవితంలో శారీరక వ్యాయామం ఎంతో అవసరమన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, రావుపల్లి సర్పంచ్ బి.మహేశ్వరరావు, బాణాల సురేష్ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు, ఎంపీపీ రామారావు

బీమా పరిహారం అందజేత

భామిని: మండలంలోని పెద్దదిమిలికి చెందిన పాలక రామారావు (47) ఇటీవల మృతి చెందగా.. ఆన భార్య రూపకు వైఎస్సార్ బీమా పరిహారం మంజూరైంది. తక్షణ సాయం కింద మంజూరైన పది వేల రూపాయలను సర్పంచ్ తొగరాన శ్రీను మృతుడి భార్యకు గురువారం అందజేశారు. మిగిలిన మొత్తం బాధితురాలి బ్యాంక్ ఖాతాకు జమవుతుందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్ పట్నాయక్, వలంటర్ సృజన, తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేలు అందజేత

వీరఘట్టం: మండలంలోని నడుకూరు గ్రామానికి చెందిన సాధు పార్వతి రెండు రోజుల కిందట మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా మంజూరైన వైఎస్సార్ బీమా పరిహారం రూ. పది వేలను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, సర్పంచ్ కర్రి రమాదేవి అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి వై. మధు, తదితరులు పాల్గొన్నారు.